క్లుప్తంగా

గార్గేయపురం పీహెచ్‌సీ తనిఖీ



చిన్నారికి టీకా వేస్తున్న డీఐఓ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు శివారులోని గార్గేయపురం పీహెచ్‌సీని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది ఎఫ్‌ఆర్‌ఎస్‌లో రోజుకు రెండుసార్లు హాజరు నమోదు చేయాలని, ఎన్‌సీడీ సర్వేలో భాగంగా ప్రతి ఏఎన్‌ఎం రోజుకు ఐదుగురికి ఐడీలు జనరేట్ చేయాలని ఆయన ఆదేశించారు. అనంతరం భూపాల్‌నగర్‌లో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. గర్భవతులు, ఐదేళ్లలోపు పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పకుండా ఇవ్వాలని, వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేసి ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

నేడు ఎస్సీ కమిషన్ చైర్మన్ రాక

కర్నూలు కల్చరల్: స్టేట్ ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుముడి విక్టర్ ప్రసాద్ కర్నూలు జిల్లాలో పర్యటించనున్నారు. బుధవారం రాత్రి మచిలీపట్నం నుంచి బయలుదేరి కర్నూలు చేరుకోనున్నారు. గురువారం ఉదయం వెల్దుర్తి మండలం బోయనపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. ఉదయం 10 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేడ్క ర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం అక్కడి నుంచి ప్రకా శం జిల్లా పర్యటనకు బయలు దేరి వెళ్లనున్నారు.

మాదిగ కార్పొరేషన్ చైర్మన్ రాక

కర్నూలు కల్చరల్: మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మిరి కనకరావు ఈనెల 27వ తేదీ కర్నూలుకు రానున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. వెల్దుర్తి మండలం బోయినపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారని పేర్కొన్నారు.

నేడు భగీరథ మహర్షి జయంతి

కర్నూలు (అర్బన్): భగీరథ మహర్షి జయంతి కార్యక్రమాన్ని ఈనెల 27న ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారి ఎ.నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశాల మేరకు ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు బుధవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

మందుబాబులకు జైలు శిక్ష

కర్నూలు: కర్నూలు శివారులోని సుంకేసుల రోడ్డులో సంజీవని హాస్పిటల్ వద్ద డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఐదుగురు వాహనదారులను బుధవారం కర్నూలు స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా రెండు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. కర్నూలు ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. కర్నూలుకు చెందిన పవన్, రఘు, అయ్యస్వాములు, ఖలీల్ అహ్మద్, మధు తదితరులు మద్యం సేవించి ద్విచక్ర వాహనంపై వస్తుండగా తనిఖీ చేసి పట్టుకుని కోర్టులో హాజరుపర్చగా వారికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

కోలుకోలేక యువకుడి మృతి

కర్నూలు: సెల్‌ఫోన్ విషయంలో జరిగిన ఘర్షణలో తీవ్ర గాయాలపాలైన కల్లూరు మండలం ముజఫర్ నగర్‌కు చెందిన చాట్ల కార్తీక్ అలియాస్ బన్నీ (17) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతిచెందాడు. చాట్ల మహేశ్వరి, ఆవులయ్య అలియాస్ ప్రభుదాస్‌లకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం. కుమారుడు కార్తీక్ పెయింటర్ పని చేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉంటున్నాడు. ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం అదే కాలనీకి చెందిన బ్రహ్మాజీరావు, రాజశేఖర్, పండు, స్వరూప్ తదితరులు కార్తీక్‌తో సెల్‌ఫోన్ విషయంలో గొడవ పెట్టుకుని బజ్జీల బండిలోని వేడి నూనెను కార్తీక్‌పై పోయడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించగా కోలుకోలేక మృతిచెందాడు. నాల్గవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : కేజీ కా భాయ్ కేజీ కా జాన్, విరుపాక్ష, దసరా, ఇవిల్‌డెడ్ రైజ్, శాకుంతలం, రావణాసుర
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : కేజీ కా భాయ్ కేజీ కా జాన్, విరుపాక్ష, దసరా, ఇవిల్‌డెడ్ రైజ్, విడుదల పార్ట్–1
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : విరుపాక్ష, విడుదల పార్ట్–1, రుద్రుడు
ఐనాక్స్ : కేజీ కా భాయ్ కేజీ కా జాన్, ఇవిల్‌డెడ్ రైజ్, సుజుమె, విడుదల పార్ట్–1, ది సూపర్ మారియో బ్రదర్స్, హలో మీరా, రావణాసుర
భరత్ కాంప్లెక్స్ : కేజీ కా భాయ్ కేజీ కా జాన్, బలగం, దసరా
శ్రీరామ : విరుపాక్ష, **రాజ్** : విరుపాక్ష
విజయ : కేజీ కా భాయ్ కేజీ కా జాన్



కర్నూలు నగరంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనాలకు ఫైన్లు వేస్తున్న పోలీసులు



మా ఇంట్లోనే అడగలేదు:
ద్విచక్ర వాహనంపై ఐదుగురు ప్రయాణం



మమ్మల్నెవరు ఆపేది:
స్కూటీలో నలుగురు యువకులు..

మా బండి.. మా ఇష్టం !

ద్విచక్ర వాహనాలపై పరిమితికి మించి ప్రయాణించడం నేరమని తెలుసు.. అంతకు మించి ప్రాణాలకు ముప్పు తప్పదనీ తెలుసు.. పోలీసులు ఎక్కడికక్కడ ఫైన్లు వేస్తున్న దృశ్యాలు చూస్తునే ఉన్నాం.. అయినా కొందరిలో మార్పు కరువైంది. రోజూ ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా, కుటుంబంలో చీకటి కమ్ముకుంటున్నా.. తల్లిదండ్రుల ఆశలను సమాధి చేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. మా పిల్లోడు బైక్ నడుపుతున్నాడని సంబరపడిపోయే తల్లిదండ్రులు.. చిన్న వయస్సులో వాహనం ఇవ్వడం నేరమని తెలుసుకోలేకపోతున్నారు. ఒకరో ఇద్దరో వెళితే పర్వాలేదు కానీ, ఏకంగా నలుగురైదుగురు కూడా వాహనాలపై మితిమీరిన వేగంతో వెళ్తున్న దృశ్యాలు యువత పెడదోవకు అద్దం పడుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

ఇంటర్‌లో ప్రైవేటు హవా



విద్యార్థులను అభినందిస్తున్న నారాయణ కాలేజ్ కోర్ డీన్ లింగేశ్వరరెడ్డి

కర్నూలు(సిటీ): రాష్ట్రంలో బుధవారం వెల్లడైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రైవేటు కళాశాలల హవా కొనసాగింది. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను బుధవారం ఆయా కాలేజీల్లో అభినందన సభలు ఏర్పాటు చేసి సన్మానాలు చేశారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. తాము విద్యార్థుల పట్ల తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ వల్లే ఉత్తమ మార్కులు సాధ్యమయ్యాయని తెలిపారు.

నారాయణ విద్యార్థుల సత్తా

నారాయణ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించినట్లు కోర్ డీన్ పి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. సీనియర్ బైపీసీలో సాయిప్రణతి 988, మనీష్ 987, షేక్ సమీనా సుల్తానా 986, రాఘవి 986, వాణి 985, అనూష 984, శ్రీహిత శర్మ 984, లహరి 984 మార్కులు, ఎంపీసీలో జాహ్నవి 989, విజయ తేజశ్విని 988, రానా సాధిక్ 988, లిఖిత 987, శృతి కీర్తి 987, పూజిత 987 మార్కులు సాధించారన్నారు. జూనియర్ విభాగం ఎంపీసీలో కావ్యశ్రీ 465, సుబ్బ మేఘన 465, ఆకున్‌నైరా 464, చరిత 464, సుబ్బరాయుడు 464, బైపీసీలో శ్వేతారెడ్డి 432, ఆఫీఫా తయబ 432, షేక్ సానియా అఫ్రా 432, బోయ మేఘన 431, మాధురి 431 మార్కులు సాధించారని వెల్లడించారు.

రవీంద్ర విద్యార్థుల విజయభేరి

శ్రీకృష్ణ, రవీంద్ర జూనియర్ కాలేజీలకు చెందిన విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించినట్లు ఆ విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య, చైర్మన్ జీవీఎం మోహన్‌కుమార్ తెలిపారు. సీనియర్ బైపీసీలో ఆర్.జ్యోష్నిక 988 మార్కులు, పి.తులసి 988, షేక్ మెరజ్ 988, ఎంపీసీలో జి.శిరీష 986, అంజుమ్ 982, విష్ణుప్రియ 981 మార్కులు, జూనియర్ ఎంపీసీలో ఆర్.మేఘన 462, సాయి యశోద 460, రక్షిత 457, బైపీసీలో సన సమ్రీన్ 431, సానియా సుల్తానా 422 మార్కులు సాధించారన్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



కుందం సాహితీ
(989) ఎంపీసీ



ఎం.మానస
(989) బైపీసీ



పి.ద్రాక్షాయని
(466) ఎంపీసీ



జి.ఉమ్మే హని
(434) బైపీసీ

శ్రీచైతన్య జూనియర్ కాలేజీల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణులైనట్లు ఏజీఎం మురళీకృష్ణ తెలిపారు. సీనియర్ ఎంపీసీలో కుందం సాహితీ 989 మార్కులు, బైపీసీలో మందం మానస 989 మార్కులు, జూనియర్ ఎంపీసీలో పి.ద్రాక్షాయని 466 మార్కులు, బైపీసీలో జి.ఉమ్మె హని 434 మార్కులు సాధించారన్నారు. వీరితో పాటు 95 శాతం మంది విద్యార్థులు ఏ కేటగిరీ మార్కులు సాధించారన్నారు.

గురుకులంలో వంద శాతం ఉత్తీర్ణత

కల్లూరు: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ (డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల) ఐఐటీ, మెడికల్ అకాడమీ విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో 87 మంది, ద్వితీయ సంవత్సరంలో 120 మంది మొత్తం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల డైరెక్టర్ రామ సుబ్బారెడ్డి తెలిపారు. సీనియర్ ఎంపీసీలో ఆర్.కిరణ్ కుమార్-978, పి. సందీప్ -960, బైపీసీలో పి.మనోజ్‌కుమార్ -984, కేఎండీ.రషీద్-980 మార్కులతో సత్తా చాటారని వెల్లడించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో అధరణకుమార్-464, కె.రాఘుసాయి-459, బైపీసీలో పి.అజయ్‌కుమార్-421, పవన్‌కల్యాణ్-420 మార్కులతో టాపర్లుగా నిలిచారని తెలిపారు

● పెద్దపాడు సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో మొదటి సంవత్సరంలో 51 శాతం, ద్వితీయ సంవత్సరంలో 72 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ ఈరన్న తెలిపారు.

● లక్ష్మీపురం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మొదటి సంవత్సరంలో 75 శాతం, ద్వితీయ సంవత్సరంలో 80 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ ఉమాదేవి తెలిపారు. మొదటి సంవత్సర సీఎస్‌ఈలో కె.పల్లవి 473 మార్కులు, ద్వితీయ సంవత్సరం సీఎస్‌ఈ గ్రూపులో ఎస్.సుల్తానా 958 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి



ప్యాలకుర్తి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య

కోడుమూరు రూరల్: అధికారులంతా ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని నియోజకవర్గ స్పెషలాఫీసర్, డీఆర్‌డీఏ వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య సూచించారు. ఆయన బుధవారం ప్యాలకుర్తి గ్రామంలో పర్యటించి గ్రామ సచివాలయాలు, అంగన్‌వాడీ సెంటర్లు, ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనం తనిఖీ, జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి సిబ్బంది, లబ్ధిదారులతో మాట్లాడారు. గ్రామ సచివాలయాల్లో సర్వీసుల సంఖ్య పెంచాలని, ప్రతి రోజు స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించాలని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం క్రమం తప్పకుండా అందించాలని సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలను సందర్శించి నాడు–నేడు పనులను, హైస్కూల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మరింత రుచికరంగా భోజనం తయారుచేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కోడుమూరు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి రోజువారీ కార్యక్రమాలపై దృష్టి సారించాలని, స్పందన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ శేషఫణి, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ అనంతయ్య, హౌసింగ్ డీఈఈ వాసుదేవరావు తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయండి



మాట్లాడుతున్న మత్స్యశాఖ డీడీ శ్యామల

సి.బెళగల్: రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా మండల అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా మత్స్యశాఖ డీడీ, మండల ప్రత్యేకాధికారిణి శ్యామల సూచించారు. బుధవారం ఎంపీడీఓ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రభుత్వ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. డీడీ మాట్లాడుతూ.. గ్రామ సచివాలయ వ్యవస్థను బలోపేతం చేసేందుకు మండల అధికారులు కృషి చేయాలని, సచివాలయాలు, వలంటీర్ల ద్వారా పల్లెల్లో అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందేలా ప్రతి ఒక్కరు పనిచేయాలన్నారు. ప్రజలతో సమన్వయం చేసుకుని సుస్థిర అభివృద్ధిని సాధించాలన్నారు. వివిధ శాఖల అధికారులు మండలంలో జరిగిన అభివృద్ధి, నివేదికలను సమావేశంలో చదివి వినిపించారు. తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ఈఓఆర్డీ సందీప్, ఏఓ మల్లేష్‌కుమార్, ఎంఈఓ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

సస్పెన్షన్లను రద్దు చేయాలి

కర్నూలు కల్చరల్: టీచర్ల అక్రమ సస్పెన్షన్లు, షోకాజ్ నోటీస్‌లను రద్దు చేయాలని ఫోర్టో సెక్రటరీ జనరల్ వి.ధనుంజయరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ వద్ద ఫోర్టో ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పాఠశాలలను సందర్శిస్తూ ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం, షోకాజ్ నోటీసులు ఇవ్వడం ద్వారా టీచర్లను భయభ్రాంతులకు గురి చేయడం తగదన్నారు. ఫోర్టో నాయకులు బాలన్న రాంభూపాల్‌రెడ్డి, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

కర్నూలు: స్థానిక ప్రకాష్ నగర్‌కు చెందిన నరేంద్రబాబుపై భార్య మనోరంజని ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూడవ పట్టణ పోలీసులు వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏడాది క్రితం వీరిద్దరికి వివాహమయ్యింది. పెళ్లి సందర్భంగా రూ.6.50 లక్షల నగదు, 14 తులాల బంగారం కట్నకానుకలుగా ఇచ్చారు. నరేంద్రబాబు ప్రస్తుతం నెల్లూరు జిల్లా వాకాడులో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో పనిచేస్తున్నాడు. భార్యను తన వెంట తీసుకెళ్లకుండా అత్త నాగేంద్రమ్మ వద్ద ఉంచి కొంతకాలంగా అదనపు కట్నం కోసం వేధిస్తుండటంతో తాళలేక తల్లిదండ్రులు సుంకన్న, రామమ్మతో కలసి పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మూడవ పట్టణ పోలీసులు తెలిపారు.

30న సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు(టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఈనెల 30న ఉదయం 9 గంటలకు జిల్లాస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం కార్యదర్శి విజయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2006 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారు ఈ పోటీలకు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 26 నుంచి 28 వరకు నిర్వహించనున్న 10వ జూనియర్ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు. వివరాలకు 70320 88008 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

30న వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం

కర్నూలు కల్చరల్: లలితా పీఠం ఆధ్వర్యంలో వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా ఈనెల 30వ తేదీన శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి తెలిపారు. ఓల్డ్‌సిటీ జమ్మిచెట్టు సమీపంలోని పీఠంలో సాయంత్రం 5 గంటలకు శ్రీమాత గోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వార్ల కల్యాణం, రథోత్సవం, ప్రత్యేక భజన కార్యక్రమాలు జరుగు తాయని పేర్కొన్నారు. లలితా పీఠం సభ్యులు, భక్తులు అందరూ పాల్గొనవచ్చని విజ్ఞప్తి చేశారు.

ప్రొబేషన్ ఖరారు చేయాలి

కర్నూలు కల్చరల్: సర్వే పరీక్ష, సీపీటీ పరీక్షలతో సంబంధం లేకుండా గ్రేడ్–2 వీఆర్వోలకు ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని, పరీక్షలు రాయడానికి ఒక సంవత్సరం కాలపరిమితి ఇవ్వాలని ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం గ్రేడ్–2 నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులకు వినతి పత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జి.వి.రమణ మాట్లాడుతూ.. గ్రేడ్ –2 వీఆర్వోలకు పరీక్షలతో సంబంధం లేకుండా ప్రొబిషన్ డిక్లేర్ చేయాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షులు ఆనంద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, కమిటీ సభ్యులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన



సంక్షేమ క్యాలెండర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

కల్లూరు: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 27వ వార్డు 69వ సచివాలయం పరిధిలోని అబ్బాస్ నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలనీలో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ముందుకుసాగారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ క్యాలెండర్లను పంపిణీ చేస్తూ ప్రభుత్వం నుంచి వారు పొందిన పథకాలను వివరించారు. అర్హులైన పేదలందరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు డ్రైనేజీ కాలువలు, కల్వర్టులు నిర్మించాలని కోరగా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కార్పొరేటర్ పల్లె శారద, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.పుల్లారెడ్డి, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిత్తడిగా మారిన కార్యాలయం



జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో వర్షపు నీరు లీకేజీ

కర్నూలు(అగ్రికల్చర్): కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి కార్యాలయం వర్షానికి చిత్తడిగా మారింది. కలెక్టరేట్ పైన గతంలో సిమెంటు ఇటుకలతో 3 అడుగుల ఎత్తు పిల్లర్లు నిర్మించారు. ఇటుక పిల్లర్లు శిథిలం కావడంతో పైనుంచి వర్షపు నీరు కిందకు లీకవుతూ అసౌకర్యంగా మారింది. దీంతో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయాన్ని సమూలంగా మరమ్మతులు చేసేందుకు వ్యవసాయ శాఖ కమిషనర్ దాదాపు రూ.20 లక్షలు మంజూరు చేశారు. మరమ్మతు పనులను ఏపీఈడబ్ల్యూ ఐడీసీ ఇంజినీరింగ్ విభాగానికి అప్పగించారు. పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయి. అయినా లీకేజీ ఆగకపోవడం గమనార్హం. జిల్లా వ్యవసాయ అధికారి చాంబర్ వద్ద పైనుంచి నీరు కిందకు లీకవుతుండడతో బకెట్లు పెట్టారు. నీరు లీక్ అవుతుండటాన్ని వ్యవసాయ సిబ్బంది ఇంజినీరింగ్ అధికారులను పిలిపించి చూపించారు. ఇంకా చేయాల్సిన పనికొంత మిగిలి ఉందని, ఆ పనులు పూర్తి చేస్తే లీకేజీ ఉండదని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

పొర్లు దండాలు పెట్టినా ప్రజలు నమ్మరు

● మంత్రి గుమ్మనూరు జయరాం



గ్రామ దేవత పూజలో పాల్గొన్న మంత్రి జయరాం

చిప్పగిరి: పాదయాత్ర చేసినా, పొర్లు దండాలు పెట్టినా నారా లోకేష్‌ను, టీడీపీని ప్రజలు నమ్మరని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. బుధవారం మంత్రి స్వగ్రామం గుమ్మనూరులో దేవరను పురస్కరించుకుని మారెమ్మ అవ్వకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు ఏమి చేస్తారో చెప్పకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడమే పనిగా లోకేష్ పాదయాత్ర సాగిస్తున్నారన్నారు. నవరత్నాల ద్వారా రాష్ట్రంలోని ప్రతి వర్గానికి మేలు జరిగిందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలన్నీ ప్రజల వద్దకే తెచ్చిన ఏకైక ముఖ్యమంత్రి మన జగనన్నే అన్నారు. 2024లో ఆయనే మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. మంత్రి వెంట దేవర గట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ, ఎంపీపీ జూటూరు హేమలత, చిప్పగిరి సర్పంచ్ గోవిందరాజులు ఉన్నారు.

28 నుంచి ఇండియన్ డ్యాన్స్ ఫెస్ట్



డ్యాన్స్ ఫెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: నృత్యజ్యోతి కళా సంస్థ 23వ వార్షికోత్సవం పురస్కరించుకొని కర్నూలులో ఈనెల 28వ తేదీ నుంచి మూడు రోజుల పాటు సౌత్ ఏషియా పీస్ కాన్ఫరెన్స్, ఇండియన్ డ్యాన్స్ ఫెస్ట్ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సౌత్ ఏషియా ఫెటర్నిటీ యూత్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు సత్యపాల్ వెల్లడించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే వేడుకల్లో వివిధ ప్రాంతాలకు చెందిన డ్యాన్స్ మాస్టర్లు, కళాకారులు పాల్గొని ప్రదర్శనలు ఇస్తారన్నారు. నృత్య జ్యోతి కళా సంస్థ కార్యదర్శి, డ్యాన్స్ మాస్టర్ డాక్టర్ కె.వి.భార్గవకుమార్ మాట్లాడుతూ నగర శివారులోని ఇండస్ పాఠశాల ఆవరణలో ఈనెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించే వేడుకల్లో మూడు దేశాలు, 15 రాష్ట్రాల నుంచి 175 మంది ఆర్టిస్టులు పాల్గొంటున్నారన్నారు. ఆర్ట్ గ్యాలరీ, స్పాట్ పెయింటింగ్, కార్టూన్ పెయింటింగ్, సాండ్ ఆర్ట్ ప్రదర్శనలు ఉంటాయన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులచే నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. నృత్య కళాకారులు పేరణి రవితేజ, షాహిద్ పాల్గొన్నారు.

నగరంలో జోరు వాన

కర్నూలు(టౌన్): నెల రోజులుగా వేసవి ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న నగరవాసులకు బుధవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి ఊరట లభించింది. రెండు గంటలకు పైగా ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. 54.06 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. భారీ వర్షానికి లోతట్టు చివర కాలనీల ప్రజలు ఇక్కట్లకు గురయ్యారు. నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్ల మీద వర్షపు నీరు చేరింది. మురుగు కాలువల నుంచి నీరు రోడ్లపైకి వచ్చాయి. స్థానిక బళ్లారి చౌరస్తా, సంతోష్‌నగర్‌లలో మురుగు, వర్షపు నీరు రోడ్డు ఎక్కాయి. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మామిదాలపాడు, మునగాలపాడు స్టాంటన్‌పురం సోనియా గాంధీ నగర్, అంబేడ్కర్ కాలనీ, సమతా నగర్, మమతా నగర్, ముజఫర్ నగర్ వంటి లోతట్టు ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అలాగే ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి వరదనీరు భారీగా చేరింది.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

కర్నూలు(అర్బన్): నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. బుధవారం ఆమె జిల్లాలోని ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ ఇంజినీర్లతో గృహ నిర్మాణాల ప్రగతిపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి స్టేజ్ కన్వర్షన్, ఎక్స్‌పెండేచర్, బ్యాంక్ టైఅప్ పురోగతి వివరాలపై రోజువారి నివేదికలను తనకు అందించాలని హౌసింగ్ పీడీ వెంకటనారాయణను ఆదేశించారు. ఇంకా ప్రారంభంకానివి 1,320, బిలో బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్న 15,669 ఇళ్లను త్వరితగతిన బేస్‌మెంట్ లెవల్‌కు తీసుకురావాలన్నారు. ప్రతిరోజూ స్టేజ్ కన్వర్షన్ల సంఖ్య గణనీయంగా పెరగాలన్నారు. ఇళ్ల నిర్మాణంలో వెనుకబడిన ఆదోని అర్బన్, హాలహర్వి, చిప్పగిరి, పెద్దకడుబూరు మండలాలకు సంబంధించిన అధికారులతో ఆమె ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ మండలాలకు సంబంధించి పురోగతి కనిపించడంలేదని, స్టేజ్ కన్వర్షన్ ఎందుకు జరగలేదని ప్రశ్నించారు. ఆదోని అర్బన్‌కు సంబంధించి థర్డ్ ఆప్షన్ కింద ఇళ్లను నిర్మిస్తున్న కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ తప్పనిసరిగా పురోగతి చూపాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.